క్లుప్తంగా

పెళ్లి కానుక అందజేత

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం టీ.చట్టే వారిపాళెం పంచాయతీ ఇరగ్గాల హరిజనవాడకు చెందిన నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి చేతుల మీదుగా అందించారు. బుధవారం పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు వధూవరులకు దుస్తులు, తాళిబొట్టు, బాసికాలు, మెట్టెలు, శ్రీవారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడు కుటుంబానికి నగదు అందించారు. కార్యక్రమంలో నాయకులు లోకనాథ రెడ్డి, రఘునాథ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జేసీ



కలెక్టర్ వెంకటరమణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని బుధవారం జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ మర్యాద పూర్వకంగా కలెక్టరేట్‌లో కలిశారు. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి కలిశారు.

పంటలపై అవగాహన



పంటను పరిశీలిస్తున్న రాసరాయనాయుడు

రామచంద్రాపురం: ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని జాతీయ ఉపాధి హామీ పథకం అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని కమ్మకండ్రిగ పంచాయతీలోని రైతు నాగమందడి సాగు చేస్తున్న మునగతోటను, కృష్ణయ్య అనే రైతు పండిస్తున్న జామచెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలపై రైతులు మక్కువ చూపాలని చెప్పారు. ఇప్పటి వరకు 1,500 కుటుంబాలు వందరోజుల పనులను పూర్తి చేశారన్నారు. ఇంకా 1000 కుటుంబాలు వందరోజుల పని పూర్తి చేయించే బాధ్యత ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లదే అని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ హంసవేణి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బీటీఏ నేతల వినతి

పాకాల : భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతిని మహిళా టీచర్స్‌డేగా నిర్వహించాలని బీటీఏ నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఎస్వీఎస్ పాఠశాల ఆవరణలో బీటీఏ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బీటీఏ రాష్ట్ర సలహాదారు ఆంజనేయులు మాట్లాడుతూ జనవరి 3వ తేదీన సావిత్రిబాయిపూలే జయంతిని మహిళా టీచర్స్‌డేగా నిర్వహించాలని ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిపారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తిరుపతి కల్చరల్: 'మానవుల మరణం అంతగా బాధించదు.. కానీ మానవ విలువల మరణం నన్ను అత్యంతగా బాధిస్తుంది' అని ప్రకటించిన శరత్ సాహిత్య అధ్యయనం నేటికీ ఎంతో అవసరమని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రవాష్ ఘోష్ రాసిన శరత్ సాహిత్యాన్ని నేటికీ అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఏమిటి అనే పుస్తకాష్కరణ సభ బుధవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ పుస్తకావిష్కరణ సభకు సీనియర్ జర్నలిస్టు ఎ.రాఘవ శర్మ, ఎస్‌యూసీఐ(సి), రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.గోవిందరాజులు, ప్రముఖ రచయిత, సాహితీవేత్త సాకం నాగరాజు, రిటైర్డ్ జిల్లా జడ్జి పి.గురప్ప, ఎస్వీయూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ డి.గోవిందులు వక్తలుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. జైభీమ్ గ్రంథాలయ నిర్వాహకుడు కాశయ్య అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య చక్రవర్తి రాఘవన్, ఏఎస్ పరమేశ్వరరావు, కుమార్‌రెడ్డి నిర్మల, ముషీర్ అహ్మద్ పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

తిరుపతి రూరల్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవచూపాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. బుధవారం వారు తుమ్మలగుంటలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మీ సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపుతామని మోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు



ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డీఈఓ డాక్టర్ వి.శేఖర్



ట్యాబ్‌ల పంపిణీలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

- విద్యకు వేలాది కోట్ల రూపాయల ఖర్చు
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు
- ట్యాబుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్పీజేఎన్‌ఎం నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం అర్బన్, మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 1,716 మంది విద్యార్థులకు ఆయన రెండవ విడత బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధనికుల పిల్లలు చదివే కార్పొరేట్ విద్యాసంస్థలకు మించిన వసతులను ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి ఈ నాలుగున్నరేళ్లలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు, విద్యారంగ అభివృద్ధికి దాదాపు రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారని తెలిపారు. విద్యార్థులకు మంచి విద్యను అందించినప్పుడే వారి జీవితం ఉన్నతంగా ఉంటుందన్న సత్యాన్ని గ్రహించి ముఖ్యమంత్రి విద్యకు పెద్దపీట వేశారని తెలిపారు. విద్యకు ఇంతలా ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రి గతంలో ఎవరూ లేరన్నారు. పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను అందించి వారిలో విద్యాప్రమాణాలు, నైపుణ్యాలను పెంపొందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దేందుకే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని, అలాగే బైజూస్ కంటెంట్‌తో కూడిన రూ.32 వేలు విలువైన ట్యాబులను 8వ తరగతి విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి బాసటగా నిలబడాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, కార్పొరేటర్ బసవ గీతాబాలసుబ్రమణ్యం, డీఈఓ డాక్టర్ వి.శేఖర్, ఎంఈఓలు బాలాజీ, భాస్కర్ నాయక్, హెచ్ఎం మునిశేఖర్, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు బండి మధుసూదన్‌రెడ్డి, కె.ధనుంజయులు నాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ రెండు నెలల్లో పూర్తి చేయాల్సిందేనని నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక 47వ డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి సమూల అభివృద్ధే లక్ష్యంగా తమ కౌన్సిల్ ముందుకెళ్తోందన్నారు. రాజీలేని నిర్ణయాలతో నగర ప్రజలకు ఆధునిక వసతుల కల్పన, నగర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ పరుగులు పెడుతున్నాయని తెలిపారు. నగరంలో ఎప్పుడు, ఎవరికీ సాధ్యం కాని విధంగా పక్కా ప్రణాళికలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. తాము మాటల్లో కాకుండా పనులు పూర్తి చేసి చూపిస్తున్నామని తెలిపారు. పదుల సంఖ్యలో మాస్టర్ ప్లాన్ రోడ్లు, లింక్ రోడ్లు, కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు కూడళ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌లు అవసరం ఉన్న చోట అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. నిస్వార్థంగా, స్వప్రయోజనాలకు తావు లేకుండా నగర భవిష్యత్తే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో తిరుపతిని దేశంలోనే ప్రముఖ నగరంగా తీర్చిదిద్దుతామని ఆయన చెప్పారు. కార్పొరేటర్ కోటేశ్వరమ్మ, మున్సిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, డీఈ విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

30 ఏళ్ల ప్రగతి పుస్తకావిష్కరణ



ప్రగతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: రాస్ కృషి విజ్ఞాన కేంద్రం 30 సంవత్సరాల ప్రగతి పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ అధ్యయన సమావేశంలో ఆ కమిటీ చైర్మన్ డాక్టర్ సంజయ్ జైస్వాల్, సభ్యులు లోక్‌సభ సెక్షన్ ఆఫీసర్స్, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఉన్నతాధికారుల చేతుల మీదుగా జరిగింది. మండలి డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే చౌదరి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రగతిని పవర్ పాయింట్ ద్వారా వివరించారు. రాస్ చైర్మన్ వెంకటరత్నం, పార్లమెంటరీ అధ్యయన కమిటీ సభ్యులు, లోక్‌సభ సెక్షన్ ఆఫీసర్స్, ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాయ్‌బర్మన్, డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏఆర్ రెడ్డి, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు, రాస్ కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రూ.7.50 కోట్లతో ఐతేపల్లి అభివృద్ధి



వృద్ధురాలికి సంక్షేమ జాబితాను అందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: సంక్షేమ పథకాల జాబితాను చేత పట్టుకుని తన తండ్రి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన మేలును ప్రజలకు గుర్తు చేస్తూ ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ.. తన అన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలంటూ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఊరూరా తిరుగుతున్నారు. మండల పరిధిలోని ఐతేపల్లి పంచాయతీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ ఫాజిలా ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు వింటూ వాటికి పరిష్కార మార్గం చూపుతున్నారు. ప్రతి గడపలో మహిళలు ఆయనకు హారతి పట్టి స్వాగతం పలుకుతున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐతేపల్లి పరిధిలోని అన్ని గ్రామాల్లో రూ.7.50 కోట్ల మేర నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని హర్షిత్ రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ బాలాజీ నాయక్, అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మల్లం రాజశేఖర్, అంజాద్ ఖాన్, జి.కిషోర్, నాయకులు ఉమర్ సాహెబ్, సోమశేఖర్, రియాజ్, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలకు మైక్ సెట్ వితరణ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలోని చర్చిలకు క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందించిన మైక్ సెట్‌లను ఎమ్మెల్యే సోదరుడు రఘునాథరెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బుధవారం భాకరాపేటలోని చర్చిలకు మైక్‌సెట్లును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకిరి భూపాల్, నాయకులు, క్రిస్టియన్ పెద్దలు పాల్గొన్నారు.

రమాదేవిలో ఆధునిక వైద్య సేవలు



అంగీకార పత్రాలను ఇచ్చిపుచ్చుకుంటున్న డాక్టర్లు

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గుండె సంబంధిత, వ్యాస్కులర్ సర్జరీ ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ శశిధర్ రెడ్డి తెలిపారు. బెంగళూరు అపోలో ఆస్పత్రితో రమాదేవి యాజమాన్యం గుండె, వ్యాస్కులర్ సర్జరీ వైద్య సేవలపై ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం అంగీకార పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా అపోలో ప్రతినిధులతో సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అపోలో ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ టీకే.వెంకటేష్, వ్యాస్కులర్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ వేణు కుమార్ మాట్లాడుతూ తిరుపతిలో తొలిసారి పూర్తిస్థాయిలో వ్యాస్కులర్ సర్జరీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సమావేశంలో అపోలో ప్రతినిధులు డాక్టర్ వెంకట్ రత్నం, డాక్టర్ ఆదిత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో చెవిరెడ్డి కుటుంబానికి ఆదరణ



పాడిపేటలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను వివరిస్తూ చెవిరెడ్డి లక్ష్మి చేపట్టిన పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని ఆమె బుధవారం తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు డ్రైనేజీ సమస్యను విన్నవించడగా, తక్షణం సమస్యకు పరిష్కార మార్గాలను చూపాలని స్థానిక నేతలకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రగిరి మరింత అభివృద్ధి చెందాలంటే తన తనయుడు వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనమునిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ తిరుమలయ్య, నాయకులు పాల్గొన్నారు.

13 షాపులకే టెండర్ దరఖాస్తులు

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్ మినహా జిల్లాలో ఖాళీగా ఉన్న 33 ఆర్టీసీ దుకాణాలకు బుధవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో బుధవారం టెండర్లు నిర్వహించారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్, పీఓ పార్థసారథి, డీఎం బాలాజీ నేతృత్వంలో టెండర్లు చేపట్టారు. అయితే 13 దుకాణాలకు సంబంధించి మాత్రమే 28 దరఖాస్తులను విక్రయించారు. అందులో 23 దరఖాస్తులను మాత్రమే వేశారు. మరో నాలుగు రోజుల్లో 13 షాపులకు సంబంధించి వచ్చిన 23 టెండర్లను పరిశీలించి ఖరారు చేయనున్నారు. అయితే టెండర్లు ఆహ్వానించిన నాటి నుంచి పెద్దఎత్తున అవగాహన చేయకపోవడంతోనే అన్ని దుకాణాలకు దరఖాస్తులు అందలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 20 దుకాణాలకు ఒక్క టెండర్ వేయకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'స్టాకులో తేడా వస్తే మీదే బాధ్యత'

పాకాల: ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని స్టాకులో తేడాలు వస్తే సూపర్‌వైజర్లు బాధ్యత వహించాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి తెలిపారు. బుధవారం మండలంలోని దామలచెరువులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొంతమంది సూపర్‌వైజర్లు నిర్లక్ష్యం వహిస్తూ స్టాకును సరి చూడడం లేదని, అలాంటి వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. తనిఖీల్లో వెరిఫికేషన్ ఆఫీసర్లు నాగరాజు, లోకనాథం, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తిరుపతి అర్బన్: ప్రజలు తమ పరిధిలోని ఆర్టీసీ సమస్యలను చెప్పండి.. వెంటనే వాటికి పరిష్కారం చూపడానికి సిద్ధంగా ఉన్నామని తిరుపతి ఆర్టీసీ డిపో మేనేజర్ బాలాజీ తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు డయల్ యువర్ డీఎంను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 11గం.ల నుంచి 12గం.ల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధించి ప్రయాణికులతో పాటు ప్రజలు తమ పరిధిలోని ఆర్టీసీ సమస్యలను తెలియజేస్తే వెంటనే వాటికి పరిష్కారం చూపుతామని వెల్లడించారు. తిరుపతి డిపో పరిధికి సంబంధించి తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, పెనుమూరు మండలాల పరిధిలోని ఆర్టీసీ సమస్యలను 9959225670కు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన వివరించారు.

అద్వితీయం .. ఆవిర్భావ నృత్యం





శ్రీపద్మావతి అమ్మవారి ఆవిర్భావం, శ్రీనివాస పద్మావతి అమ్మవారి పరిణయం నృత్య రూపకంలోని దృశ్యాలు

తిరుపతి కల్చరల్: భారత కళాక్షేత్రం ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన శ్రీపద్మావతి అమ్మవారి ఆవిర్భావ జీవిత వృత్తాన్ని ఆవిష్కరిస్తూ కళాకారులు చేపట్టిన నృత్య రూపకం అద్వితీయంగా సాగింది. ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో కలియుగ వైకుంఠుడైన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీపద్మావతి అమ్మవారి వైభవాన్ని తెలియజేస్తూ నృత్య కల్యాణోత్సవాలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీపద్మావతి అమ్మవారు ఆవిర్భావం నుంచి శ్రీనివాస పద్మావతి కల్యాణం వరకు కళాకారులు భరతనాట్య నృత్య రూపకంలో చక్కటి అభినయంతో నర్తించి ఆకట్టుకున్నారు. సుమారు 40 మంది కళాకారులు సన్నివేశానికి అనుగుణంగా అద్భుత సెట్టింగ్‌ల మధ్య శ్రీపద్మావతి ఆవిర్భావ ఘట్టం నృత్యాభినాయన్ని ప్రదర్శించి చూపరులను మైమరిపించారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

'మొహంజోదారో' ఆవిష్కరణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

చంద్రగిరి: మొహంజోదారో ప్రపంచానికి పరిచయమై శత వసంతాలను పూర్తి చేసుకోవడంతో మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లోని శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో బుధవారం ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ముంబైలోని ఎడ్యుకేషన్ వరల్డ్ సీఈఓ, భవిన్ షా, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ అమరేందర్‌నాథ్, తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పురావస్తు శాఖ బోర్డు చైర్మన్ డాక్టర్ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన, దేవతారాధనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల ఫ్యాషన్ షో, ఫొటో గ్యాలరీ, వివిధ రకాల సంప్రదాయ ఆటలతో మొహంజోదారో సంస్కృతికి సంబంధించిన అద్భుతమైన ప్రదర్శనను ప్రదర్శించారు. దీనికి తోడు శిల్ప, టీటీడీ శిలా విగ్రహ రూపకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేష్ పాటిల్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం పార్లమెంటరీ ఎస్టిమేట్ కమిటీ చైర్‌పర్సన్ ఎంపీ సంజయ్ జైస్వాల్, ఎంపీలు మాగుంట శ్రీనివాసరెడ్డి, కేసినేని నాని, రాజీవ్ ప్రతాప్ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న భక్తులు

ఆధ్యాత్మిక పుణ్యక్షేత్ర తిరుమలలో మంగళవారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారంలో తిరుమల శ్రీవారిని 71,488 మంది భక్తులు దర్శించుకున్నారు. అదేవిధంగా తిరుమల శ్రీవారికి 19,137 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. అదేవిధంగా హుండీ రూ.4.17 కోట్లను భక్తులు కానుకలుగా సమర్పించారు.





ఆలయం వెలుపల ఎంపీలు సంజయ్ జైస్వాల్, మాగుంట